# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 21-02-2026** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పల్నాడు జిల్లా వినుకొండలో ఈరోజు పర్యటిస్తున్నారు.**
2. **దేశంలో విమానాశ్రయాల అభివృద్ధి వేగంగా జరుగుతోందని కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు.**
3. **తెలుగు భాష గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పాలని పూర్వ ఉప రాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు పేర్కొన్నారు.**
4. **ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్" కార్యక్రమం 131వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది.**

==========================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పల్నాడు జిల్లా వినుకొండలో ఈరోజు పర్యటిస్తున్నారు. ప్రతి నెలా 3వ శనివారం నిర్వహించే 'స్వర్ణాంధ్ర -- స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి ఈ మధ్యాహ్నం వినుకొండ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైనదానంలో హెలీపాడ్ కు చేరుకున్నారు. కొద్దిసేపటిలో అక్కడ ఏర్పాటు చేసిన ప్రజావేదికకు చేరుకుని ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతారు. అనంతరం వివిధ స్టాళ్లను సందర్శిస్తారు, అదేవిధంగా పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి ఆసుపత్రిలో బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణపై సమీక్షిస్తారు. సాయంత్రం జూనియర్ కాలేజీ క్రీడా మైదానంలోని హెలీప్యాడ్ కు చేరుకుంటారు. అక్కడి నుంచి ఉండవల్లిలోని తన నివాసానికి వెళతారని అధికారులు తెలిపారు.

--------------------------

దేశంలో విమానాశ్రయాల అభివృద్ధి వేగంగా జరుగుతోందని కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. తిరుమలలో ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని కేంద్రమంత్రి ఈరోజు పరిశీలించారు. అనంతరం ఆయన శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ.. విమానాశ్రయాల్లో ప్రయాణికులకు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. తిరుమలలో ఏఐతో దర్శనం కల్పించేలా ఏర్పాటు చేయడం గొప్ప విషయమని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు పేర్కొంటూ..

వాయిస్...30 సెకన్లు

-------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 131వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ తెలుగు అనువాదం ప్రధాని ప్రసంగం అయిన వెంటనే ఒకసారి, రాత్రి 8 గంటలకు మరోసారి ఉభయ తెలుగు రాష్ట్రాలలోని అన్ని ఆకాశవాణి కేంద్రాల ద్వారా ప్రసారమౌతుంది.

-------------------------

తెలుగు భాష గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పాలని మాజీ ఉప రాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు అన్నారు. విజయవాడలోని ఒక కళాశాలలో పూర్వ విద్యార్థుల సంఘం స్వర్ణోత్సవ సంబరాల్లో ఆయన ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు మాట్లాడుతూ.. దేశాన్ని, మాతృ భాషని, చదువుకున్న విద్యా సంస్థని, గురువులని మర్చిపోకూడదని పేర్కొన్నారు. మన పూర్వీకులు మనకి అందించిన సంప్రదాయాలని భావితరాలకు అందించాలని వెంకయ్య నాయుడు తెలియజేస్తూ..

వాయిస్. ..25 సెకన్లు

-------------------------

మరణించిన మత్స్య కారుల కుటుంబాలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సహాయం అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని మత్స్య శాఖ మంత్రి కే.అచ్చెన్నాయుడు అన్నారు. గ్రూప్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ స్కీమ్ కింద మరణించిన 95 మంది మత్స్యకారుల కుటుంబాలకు ఎక్స్ గ్రేషియా విడుదల చేసినట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. 2018 నుంచి వివిధ దశలలో పెండింగ్‌లో ఉన్న ఈ కేసులను ప్రత్యేకంగా పరిశీలించి, మొత్తం నాలుగు కోట్ల 75 లక్షల రూపాయలను విడుదల చేసినట్లు ఆయన వివరించారు. 95 మంది లబ్ధిదారులలో 90 మంది కుటుంబాల బ్యాంకు ఖాతాల్లో ఎక్స్ గ్రేషియా మొత్తాలు జమ చేసినట్లు చెప్పారు. మిగిలిన అయిదు కుటుంబాల లబ్ధిదారుల ఖాతా వివరాల్లో ఉన్న సాంకేతిక సమస్యల కారణంగా ప్రక్రియ పూర్తికాలేదని, వాటిని త్వరితగతిన పరిష్కరించి వారి ఖాతాల్లో జమ చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు.

-------------------------

సమాజానికి శత్రువుగా మారిన గంజాయిని నిర్మూలిద్దామని ఈగల్ పోలీస్ ఇన్స్పెక్టర్ జనరల్ రవి కృష్ణ అన్నారు. విజయవాడలో ఆయన ఈగల్ వార్షిక నివేదిక -2025కు సంబంధించిన వివరాలను ఈరోజు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం, వివిధ శాఖల సహకారంతో ఈగల్ డ్రగ్స్ నిర్మూలనకు అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. విద్యాసంస్థల్లో 40 వేలకు పైగా ఈగల్ క్లబ్బులు ఏర్పాటు చేసి 35 వేలకు పైగా అవగాహన కార్యక్రమాల ద్వారా 20 లక్షలకు పైగా విద్యార్థులను చైతన్య పరిచినట్లు రవి కృష్ణ వివరిస్తూ...

వాయిస్. ..20 సెకన్లు

-------------------------

ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేసేందుకు మనమిత్ర వాట్సప్ గవర్నెన్స్ గురించి ప్రత్యేక ప్రచార కార్యక్రమాలతో విస్తృత అవగాహన కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ జిల్లా కలెక్టర్ లను ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయం నుంచి వివిధ ప్రభుత్వ కార్యక్రమాల అమలుపై జిల్లా

కలెక్టర్లతో దృశ్యమాధ్యమ సమీక్షను ఆయన నిన్న నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ వాట్సాప్ సేవలను వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకు సంబంధించి జిల్లాల్లో ప్రత్యేక ప్రచార కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు.

---------------------------

ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ రహిత బ్యాగులను ఉపయోగించాలని అనంతపురం శాసనసభ్యులు దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. అనంతపురంలో నిర్వహించిన స్వచ్ ఆంధ్ర – స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో ఆయన ఈ రోజు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా దుకాణాలను పరిశీలించి ప్లాస్టిక్ బ్యాగులు వాడకూడదని సూచించారు. ప్లాస్టిక్ రహిత నగరంగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని శాసనసభ్యుడు దగ్గుపాటి ప్రసాద్ తెలియజేస్తూ..

వాయిస్. ..25 సెకన్లు

---------------------------

దేశవ్యాప్తంగా 9వ తరగతి విద్యార్థుల నుంచి యువ విజ్ఞాన కార్యక్రమానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. వైజ్ఞానిక శాస్త్రంతో పాటు అంతరిక్ష పరిజ్ఞానం, దాని అనువర్తనాలపై క్విజ్ రూపంలో పిల్లలను పరీక్షిస్తారని చెప్పారు. ఈనెల 27వ తేదీ నుంచి మార్చి 31వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. 2026 జనవరి 1 నాటికి 9వ తరగతి చదువుతున్న భారతీయ విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని వివరించారు.

---------------------------

రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏపీ పీజీ లాసెట్–2026కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు లాసెట్ కన్వీనర్, మహిళా వర్సిటీ న్యాయవిభాగం ఆచార్యులు సీతాకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. 3, 5 సంవత్సరాల ఎల్ఎల్బీ, రెండేళ్ల ఎల్ఎల్ఎం కోర్సుల్లో ప్రవేశాలకు అభ్యర్థులు వచ్చేనెల 12లోపు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. అపరాధ రుసుముతో మార్చి 28వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. మే 4న ప్రవేశ పరీక్ష ఉంటుందని, మరిన్ని వివరాలకు వెబ్సైట్ను పరిశీలించాలని ఆమె సూచించారు.

---------------------------

ఐసిసి పురుషుల టి 20 ప్రపంచ కప్ లో భాగంగా సూపర్ 8లో గ్రూప్ 2 విభాగంలో శ్రీలంకలోని కొలంబోలో పాకిస్తాన్, న్యూజిలాండ్ జట్లు ఈ రోజు తలపడనున్నాయి. రాత్రి 7 గంటలకు ఈ మ్యాచ్ ప్రారంభం కానుంది. రేపు మధ్యాహ్నం మూడు గంటలకు పల్లెకెలెలో సూపర్ 8లో గ్రూప్ 2 విభాగంలో ఇంగ్లాండ్, శ్రీలంక, రాత్రి 7 గంటలకు గ్రూప్ 1లోని భారత్, సౌత్ ఆఫ్రికా జట్ల అహ్మదాబాద్ వేదికగా తలపడనున్నాయి.

---------------------------

త్వరలో ప్రారంభం కానున్న వేసవి సెలవులలో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపడుతున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం అదనపు కార్యనిర్వాహణ అధికారి సి.హెచ్.వెంకయ్య చౌదరి తెలిపారు. తిరుమలలోని సుధర్మ సమావేశ మందిరంలో వేసవి ఏర్పాట్లపై అధికారులతో ఆయన నిన్న సమీక్షా సమావేశం నిర్వహించారు.

=====================